క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడ్తాల్: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

రైతు బజారులో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 33, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకర 42, బీర 40, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 75–115, క్యారెట్ 37, దొండ 27–28, చిక్కుడు 65, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 20, దోస 15, సొర 13, పొట్ల 23, ఉల్లి 14, చామగడ్డ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మైసిగండి అభివృద్ధికి కృషి: సర్పంచ్



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తులసీరాంనాయక్

కడ్తాల్: మైసిగండి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గ్రామ సర్పంచ్ రమావత్ తులసీరాంనాయక్ అన్నారు. మైసిగండి దేవాలయం నుంచి మైసిగండి గ్రామానికి వెళ్లే దారిలో రూ.10 లక్షల జీపీ నిధులతో నిర్మించ తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సోమవారం సర్పంచ్ భూమిపూజ చేశారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. నాయకులు లస్కర్యా, గోపాల్, కిరణ్, దశరథ్, కృష్ణ ఉన్నారు.

ఆలయంలో నూతన భవనం ప్రారంభం



ఆలయ భవన ప్రారంభోత్సవంలో దాతలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని ఇనాంగూడ గ్రామంలో గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో అర్చకుడు భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన భవనాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ అంతటి యశోద ప్రారంభించారు. గ్రామానికి చెందిన అంతటి జంగమయ్య–తిరుపతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు అంతటి ఆంజనేయులు–పెద్దయశోద, అంతటి ఊషయ్య–యశోదా, అంతటి రాములు–యాదమ్మతో పాటు కూతురు నక్క లక్ష్మమ్మదాసుగౌడ్ ఈ భవన నిర్మాణానికి ముందుకు వచ్చారని ఆలయ అర్చకుడు శర్మ ఈ సందర్భంగా తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుర్కయంజాల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో రూ.1.70 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇంజాపూర్ నుంచి తొర్రూర్ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, డీసీసీబీ వైస్‌చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణా రెడ్డి, నాయకులు..ఆనంద్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చండి

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం

కందుకూరు: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల శ్రీశైలం, కార్యదర్శి వరికుప్పల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వడ్డెర సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా వడ్డెర జీవితాల్లో మార్పులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కులస్తులకు న్యాయబద్ధంగా అందాల్సిన హక్కులను కల్పించాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న కందుకూరు మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు డి.వెంకటరమణ, నియోజకవర్గం అధ్యక్షుడు వి.నరసింహ ప్రకటించారు. కందుకూరు మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా డేరంగుల విశాల్, ఉపాధ్యక్షుడిగా వరికుప్పల జంగయ్య, ప్రధానకార్యదర్శిగా డేరంగుల వెంకటరమణ, యూత్ అధ్యక్షుడిగా డేరంగుల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు వరికుప్పల కుమార్, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

నిరంతర విద్యుత్‌తో ప్రగతి పథం

- ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఘనంగా విద్యుత్ విజయోత్సవ సంబురాలు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరంతర విద్యుత్ సరఫరానే తెలంగాణ ప్రగతికి సోపానం అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లో విద్యుత్ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని తెలిపారు. గతంలో 11 సబ్‌స్టేషన్లు ఉన్న మన నియోజకవర్గం.. ఇప్పుడు 33 సబ్‌స్టేషన్లతో నిరంతర విద్యుత్ సరఫరా చేసే స్థాయికి చేరుకుందన్నారు. దేశంలో రైతులకు 24గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డీఈ యాదగిరి, ఎంపీపీలు కృపేశ్, నర్మద, జెడ్పీటీసీలు మహిపాల్, జంగమ్మ, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

ఆమనగల్లు: నిరంతర విద్యుత్ సరఫరాతో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ విద్యుత్ విజయోత్సవ సభను నిర్వహించారు. ఆమనగల్లు ఏడీఈ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో వచ్చిన మార్పులు అభివృద్ధి పైన వీడియో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో కోతలు లేకుండా వ్యవసాయ రంగంతో పాటు గృహ, వాణిజ్య పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలో గతంలో 36 సబ్‌స్టేషన్లు ఉండగా ప్రస్తుతం 46 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. గతంలో 7121 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా ప్రస్తుతం 12,132 ఉన్నాయని చెప్పారు. సర్‌ప్లస్ పవర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీను, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్లు సత్యం, రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, ఆమనగల్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ, దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్, వైస్ చెర్మన్ సత్యం, విద్యుత్ ఏఈ సీతారాం, మనోజ్, కటారియా, నరేందర్, ఏంపీడీఓ హుస్సేన్, తహసీల్దార్ జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌరిపల్లి, కేతావత్ తండాలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయ మండపాన్ని నిర్మిస్తున్నారు. వరప్రసాద్‌రెడ్డి సోమవారం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. మండప నిర్మాణానికి రూ.1,20,000 విలువైన ఇసుక, సిమెంట్, స్టీల్, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను అందజేశారు. అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. సర్పంచ్ అనురాధ, నరేందర్‌గౌడ్, ఉప సర్పంచ్ ఆంజనేయులు, వార్డుసభ్యులు లచ్చిరాం, రాఘవేందర్, మల్లేశ్ శివ, యాదయ్య, తండావాసులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి మెటీరియల్ అందజేస్తున్న సభ్యులు

హనుమాన్ ఆలయ నిర్మాణానికి..

వెల్జాల్‌లోని హనుమాన్ ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన పర్యటించారు. హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ స్లాబ్ నిర్మాణానికి రెండుమూడు రోజుల్లోగా మెటీరియల్‌ను అందజేస్తానని చెప్పారు.

ఘనంగా పెద్దమ్మ పండుగ

మంచాల: మంచాల మండల కేంద్రంలో సోమవారం శ్రీ పెద్దమ్మ దేవి పండుగను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మాజీ ఎంపీపీ మర్రినిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే రంగాపూర్ గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, సర్పంచ్ మమత, ఉప సర్పంచ్ జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో మర్రి నిరంజన్‌రెడ్డి తదితరులు

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

బడిబాటలో ఉపాధ్యాయుల అవగాహన

యాచారం: మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, మల్లేశ్, మహేష్, సౌజన్య తదితరులు గ్రామంలో పర్యటించి బడీడు పిల్లలున్న తల్లితండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు.

బడీడు పిల్లలు బడిలో ఉండాలి..

మంచాల: మంచాల మండల పరిధిలోని నోముల గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంచాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్య, అన్ని వసతులున్నాయన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. నోముల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు జగన్, బాలునాయక్, నవనీత, విజయ్‌కుమార్, బాలరాజ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



యాచారం: చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కల్వకుర్తిలో వైఎస్సార్‌టీపీ జెండా ఎగురేస్తాం

ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి

కడ్తాల్: ప్రజల ఆశీర్వాదంతో నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ జెండా ఎగురేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండలం రెఖ్యాతండాకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్న పోరాటానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై పోరాడుతూ నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో.. శ్రీను, గణేశ్, హరీశ్, వినోద్, శ్రీకాంత్, శ్రీనివాస్, రమేశ్, పవన్, మోహన్, శ్రీధర్, వాసు, శ్రీను, పవన్‌కుమార్, హరి, వాసు, భాషా తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు నరేష్‌గౌడ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయులు.. ఫిరోజ్, అరుణ్, శివ, రాకేశ్‌రెడ్డి, పవన్, వెంకట్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీతోనే సంక్షేమ పాలన..

ఆమనగల్లు: రాష్ట్రంలో సంక్షేమ పాలన రావాలంటే వైఎస్సార్‌టీపీతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల అర్జున్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో శివరాజ్, పుల్లయ్య, మధు, బాలు రవీంద్ర, మహేష్, వేణు, శివ, హరికృష్ణ, తరుణ్, శివకుమార్, జంగయ్య, విష్ణు ఉన్నారు. వైఎస్సార్‌టీపీ నాయకులు నరేష్‌గౌడ్, ఫిరోజ్, శివ, అరుణ్, రాకేష్ రెడ్డి, సాయి, పవన్, వెంకట్ పాల్గొన్నారు.



కడ్తాల్: అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిన నాయకులు

రాయితీ విత్తనాలను సిద్ధంగా ఉంచండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: రైతులకు అందించేందుకు రాయితీపై కూరగాయల విత్తనాలను సిద్ధంగా ఉంచాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి కోరారు. కేసీఆర్ సర్కార్ వచ్చినప్పటి నుంచి రాయితీపై విత్తనాలు గాని, వ్యవసాయ పనిముట్లు గాని, ఇతర సామగ్రి గాని అందుబాటులో ఉంచడం లేదని అన్నారు. మహానగరానికి చుట్టూ విస్తరించి ఉన్న రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో వందలాది మంది రైతులు వేలాది ఎకరాల్లో కూరగాయల పంటల సాగు చేస్తారని అన్నారు. రైతుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రాల్లో ఉద్యాన శాఖ పర్యవేక్షణలో కూరగాయల విత్తనాల విక్రయాలు జరిపేలా కృషిచేయాలని కోరారు. ప్రైవేట్ నర్సరీల్లో నాసిరకమైన నార్లు, విత్తనాలు లభిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. వెంటనే రాయితీపై విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరారు.

విజయసంకల్ప సభకు తరలిరండి

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండపై మంగళవారం నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కడ్తాల్ గ్రామ పంచాయతీలో ఇప్పటికే సుమారు 50 వేల మొక్కలను నాటి సంరక్షిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ తరాలకు నీటి కష్టాలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, వార్డు సభ్యులు భిక్షపతి, హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, లక్ష్మణ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

నిలువ నీడ కరువు

- కడ్తాల్ మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు
- రోడ్డుపైనే బస్సుల కోసం పడిగాపులు
- ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి
- బస్టాండ్ నిర్మించాలని వినతి



కడ్తాల్ ప్రధాన రోడ్డుపైన నిలిపిన ఆర్టీసీ బస్సులు

కడ్తాల్: మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు కలగానే మిగిలి ఉంది. దీనికితోడు బస్‌షెల్టర్లు ఒకచోట, బస్సులు మరోచోట నిలుపుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై గతంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న బస్‌షెల్టర్ ఉండేది. అందులో 10–15 మంది ప్రయాణికుల వరకు కూర్చునే అవకాశం ఉండేది. ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంతో ఆ షెల్టర్‌ను కూల్చివేశారు. దాని స్థానంలో రోడ్డు నిర్మాణ గుత్తేదారులు బస్సులు నిలపని ప్రదేశాల్లో రెండు బస్‌షెల్టర్లు నిర్మించినా అక్కడ బస్సులు నిలపడం లేదు. దీంతో ప్రధాన రోడ్డుపైనే బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి. వాణిజ్య, వ్యాపారపరంగా కడ్తాల్ ఎంతో అభివృద్ధి చెందుతున్నా సరైన బస్సు ప్రాంగణం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చెట్లను నరికివేయడంతో నిలువ నీడ కరువైంది.

నిత్యం రద్దీగా...

మండల కేంద్రం మీదుగా నిత్యం వందలాది బస్సులు తిరుగుతుండటంతో రహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్‌షెల్టర్ వద్ద వాహనాలు నిలపకుండా రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం, సాయంత్రం సమయంలో ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్డు పక్కన ఎండకు ఎండి, వానకు తడిచి బస్సుల కోసం వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన బస్టాండ్ ఏర్పాటు చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే నిలబడుతున్నాం



మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బస్సు షెల్టర్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపేనే నిలబడి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన బస్టాండ్ నిర్మించాలి.

– శివ, ప్రైవేట్ ఉపాధ్యాయుడు, కడ్తాల్

ప్రతిపాదనలు పంపించాం



బస్టాండ్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులకు, మంత్రులకు గతంలో పలుమార్లు వివరించడం జరిగింది. బస్టాండ్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా అందజేశాం. ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుని బస్టాండ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికుల కష్టాలు తీరుతాయి.

– కమ్లీమోత్యానాయక్, ఎంపీపీ, కడ్తాల్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం మండల పరిధిలోని మైసమ్మ ఆలయ సమీపంలోని ఓ రిసార్ట్‌లో ఘనంగా నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత మిత్రులందరూ ఒకచోట కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి పాఠశాల ఉపాధ్యాయులు వెంకటయ్యగౌడ్, అమరేశ్వర్, అంజయ్య, వెంకటరమణ, అంజయ్య, భూపాల్‌రెడ్డి, స్వరూప్‌కుమార్, హనుమాన్‌సింగ్‌తో పాటు, పూర్వవిద్యార్థులు పవన్, నర్సింగ్, రమేశ్, శ్రీశైలం, లింగం, యాదయ్య, హనుమంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, అర్జున్, భాస్కర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



రావిచేడ్ జెడ్పీహెచ్‌ఎస్ 2001-02 బ్యాచ్ విద్యార్థులు

నేడు పారిశ్రామిక ఉత్సవాలు

తుక్కుగూడ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ఈ–సిటీలో పారిశ్రామిక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రిసబితా రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అతిథిగృహ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

తుక్కుగూడ: రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాగణంలో శ్రీ రాజరాజేశ్వర గౌడ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ వసతి గృహం నిర్మిస్తున్నారు. ఇందుకు దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ దంపతులు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ గ్రామంలో రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌దాస్‌గౌడ్, హరిచరణ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న తూళ్ల దేవేందర్‌గౌడ్